# అరటి తొక్క

దొండపర్తి జంక్షనులో డి. బి. కె. ఆఫీసులకు ఎదురుగా నాయుడు కిళ్లీకొట్టుకు రెండేరెండు అరటిపండ్ల గెలలు సామాన్యుడి ఆహారసమస్యకు పరిష్కార సూచకంగా వ్రేలాడుతున్నాయి. అక్కడికి ఆఫీసుబాబులు, పదమూడునంబరు బస్సు జనం, రిక్షావాళ్ళు అందరూ ప్రోగవుతారు. అక్కడ తూము మీద నిరంతరం ఎవరో ఒకరు కూర్చుని, వంగుని, నిలబడి మాట్లాడుతూ ఉంటారు. అక్కడ రేషను బియ్యం, నీటిఎద్దడి, కరెంటు తగ్గింపు గురించీ, డి. బి. కె. బాబులు ఉద్యోగాలు, ప్రమోషనులు, ఆఫీసు గొడవల్ను గురించీ, స్కూళ్ళకు కాలేజీలకుపోయే జనాభా పరీక్షల గురించీ ఎవరి గొడవ వారు చెప్పుకుంటూ ఉంటారు. ఈ మధ్యలో అరటిపండ్ల గెలలు - ఒకటి పచ్చ అరటి - రెండూ తరిగిపోతూ ఉంటాయి. అరటిపళ్ళు కడుపులోకి పోగా తొక్కలు పైన మిగిలిపోతాయి. ఆ అరటి తొక్కలు జనం ఎక్కువపడితే అక్కడ పారవేస్తూ ఉంటారు. నాయుడు కొట్లో రోజుకి నాలుగైదు గెలలు అరటిపళ్ళు ఖర్చవుతాయి. ఈ తొక్కలన్నీ ఏమవుతున్నాయి అని సుబ్బారావుకి

ఆలోచన పట్టుకుంది. సుబ్బారావు సంక్షేమాధికారి. అతను ఉద్యోగుల సంక్షేమం గురించి ఆలోచించటానికి అలవాటుపడి ఉన్నాడు. ఒక ఉద్యోగి అరటితొక్కమీద కాలువేసి జారి పడ్డాడనుకోండి. అతను డ్యూటీలో వుంటే ఒక విధంగా కేసు నడిపించాలి. లేని సమయంలో అయితే మరొక రకంగా వ్రాయాలి. ఈ విధంగా అరటితొక్కలను గురించి ఆలోచించుకుంటూ పోగా తనకేగాక ప్రజలకేగాక యావత్తు దేశానికి అరటితొక్కలు తీరని సమస్యగా పరిణమించే అవకాశాలు సుబ్బారావుకు కనుపించాయి. దాన్తో అతనికి ముచ్చెమటలు పోశాయి.

సుబ్బారావు అరటితొక్కలు గురించి ఆలోచించడం మానుదామనుకుని బస్సుకోసం నిలబడిన అమ్మాయిలకేసి దృష్టి సారించాడు. అందులో ఒక యీడు వచ్చిన అమ్మాయి బిరిలిను దుస్తులు వేసుకుని కూడా అరటిపండు తిని తొక్కను విలాసంగా గిరవాటు పెట్టింది. అసలు యీడువచ్చిన ఆడపిల్లలు అరటిపండు పబ్లికున తినడం గురించి సుబ్బారావుకు కొన్ని అభిప్రాయాలున్నాయి. అతను ఆ అరటిపండు తొక్కను ఆ అమ్మాయి చూస్తూవుండాగా పట్టుకెళ్ళి చెత్తబుట్టలో పారేసి వస్తే... క్షమించండి సుబ్బారావుగారూ! ఈ హృదయంలో కల్లోలాన్ని లేవకండి. నా ముఖంకేసి చూడండి. నా కన్నీళ్ళతో మీ పాదాలను కడగనివ్వండి. అరటితొక్కమీద చేయి వేయకండి" అని మెలోడ్రమెటిక్ గా అంటే తను మృదుల దరహాసంతో ఆమె చేయి నెట్టివేస్తూ నన్నపార్థం చేసుకుంటు

న్నావా సుజీ! ఏదీ నా కళ్ళలోకి చూడు—పిచ్చిదానా—కులగిరులింకుగాక - రిపుసంతతి తేజము తప్పుగాక - యీ అరటి తొక్కను చెత్తబుట్టలో వేసివస్తాను. ధర్మం అన్నిటికన్నా గొప్పది. మన దేశానికి కళంకం కలిగేపని ఏదీ నేను చూసి సహించలేను సుజీ! నేనుచూసి సహించలేను. ఇలా సుబ్బారావు అరటిపండు తొక్కనుండి అందమైన సుజీవరకు డైలాగులవంతె నల్లుకడుతూ ఉండగా ప్రపంచం తల్లక్రిందులైనంతపని జరిగింది. వెనకనుంచి చెంగుమని గెంతుకుంటూ వచ్చిన లేగదూడ సుబ్బారావుకి నాయరు కిల్లీ కొట్టుకు ఎదురుగుండా అటాక్ యిచ్చేసింది. సరిగా అదే సమయానికి రామారావు బూటు కాల్తో లేగదూడను డొక్కలో తన్నకపోయినట్లయితే సుబ్బారావు అంతరాత్మ, శరీరము రెండూ వేరయిపోయి ఉండేవి. కాని సుబ్బారావుని డేంజరులోంచి తప్పించాలనుకుని రామారావు ఆ బూటు డి. బి. కె. సొమ్ముతోనే కొన్నాడు. అక్కడ ఒకావిడ రైలింజనులా రంకెలు వేస్తోంది. ఆవిడ డి. బి. కె. సొమ్ముతో పాల వ్యాపారం చేస్తోంది.

"ఏటి బాబూ - బూటు కాల్తో లేగదూడ డొక్కలో తన్నినావుగందా- నీ సదువు బూడిదలో పొయ్యా! నీకు బగవంతుడు నేడా! కలిమండి పోనాది. నీ జిమ్మడ - నీ సరంలాగ అని తారస్థాయి నందుకుంది. ఒక మెట్టు ఎక్కి ఆ రైలింజను "అరటిపళ్ళ తొక్కలకోసం లేగదూడ నాయరు బడ్డీకాడకు వస్తాది కాని, నీ సోకులు బూటుతో తన్నులు తినడానికి కాదు" అని అరుస్తోంది. సుబ్బారావు చెవులు రిక్కించి విన్నాడు.

అందరూ లేగదూడ పక్షమే మాట్లాడారు. ఒక్కరూ సుబ్బారావుని కాని రామారావుని కాని సమర్థించలేదు. సుబ్బారావు దీనంగా అరటి తొక్కల్ని నములుతూ తన పనిని తగ్గిస్తున్న ఆవుదూడ కేసి చూసాడు. అది న్యూసు పేపర్లు, గుడ్డపీలికలు తింటుంది. ఎవరేనా దళ్ళు కట్టుకుంటే దానికి ఒళ్ళుమంట కాబోలు- క్రుమ్మేసి వస్తుంది ఆ దొండపర్తి జంక్షనులో అది సాధారణంగా నిలబడి అరటి తొక్కల్ని తినేచోట యీవాళ సుబ్బారావు నిల్చున్నాడు.

కాని ఎప్పుడైతే లేగదూడ సుబ్బారావుని కుమ్మేసిందో ఆ క్షణమందే అతడికి జ్ఞానోదయమైంది. అజ్ఞానంతో అతడు ఆ లేగదూడ ముఖంలోకి తీక్షణంగా చూసాడు. కన్నార్పకుండా చూసి రామారావు కనిపెట్టావా! అని హెచ్చరించాడు, రామారావు చాలా యిరుకున పడ్డాడు. అతన్ని ఎన్ని మాటలన్నా ఏమనుకునేవాడు కాదు. అతని అంబాసిడరు బూటుని తేలిక చేసి మాట్లాడినందుకు ఆ పాలావిడ తనచొక్కా మిసమిసలను కూడా లెక్క చేయనందుకు లోపల కుతకుతా ఉడికిపోతున్నాడు. సుబ్బారావు రామారావుని ప్రక్కకు తీసుకెళ్ళి "సారీ చెబుదాం. ఇంకా మనకేసి ఎలా చూస్తుందో—! అని గొణిగాడు, ఆవుదూడకు సారీ ఎలా చెప్పటమా ఈ మానవ నాగరికత రోజురోజుకీ యింత క్లిష్టమై పోతున్నదేమా అని రామారావు దిగులుపడ్డాడు.

"ఇంకా తెలీలేదా!" అని క్వశ్చెన్ మార్కు పెట్టాడు.

"తెలీలేదా!" అని రెట్టించాడు. రామారావు సుబ్బా

రావుకేసి అతిదీనంగా చూసాడు. ఫిబ్రవరి ఉదయమార్తాం డుడు చండ ప్రచండంగా పాలావిడ కోపంలా వెలిగిపోతు న్నాడు. ఆవుదూడ అరటితొక్కలు నములుతూ ఓరగంటి సుబ్బారావు రామారావుల్ని కనిపెడుతోంది.

"మన ఆఫీసులో సెటిల్మెంటు సెక్షన్లో పరమేశ్వరన్ లేడూ? వాడేనయ్యా..." అని దూడకేసి వేలు సారించి చూపిస్తూ" అచ్చం పరమేశ్వరన్‌లా ఎలా చూస్తోందో—వాడేనయ్యా—యీ జన్మలో పుణ్యం చేసుకోబట్టి యిలా తయారయ్యాడు." అని ఓ చిన్నసైజు అణుబాంబును సుబ్బారావు ప్రేల్చాడు.

ఆ ఆవుదూడ తన ఆఫీసులో పనిచేసిన పరమేశ్వరన్ అని రుజువులు సాక్ష్యాలు వేకరువు పెట్టడం ప్రారంభించాడు. మరి పరమేశ్వరన్ అయితే నీకు ఎందుకు అటాక్ యివ్వటం అని రామారావు ప్రశ్నించాడు. సుబ్బారావు రామారావును జనమేజయుడ్ని చూసినంత సంశయంతో చూస్తూ— "ఆ పరమేశ్వరన్‌గాడి కేసు నేను సరిగ్గా డీల్ చెయ్యలేదని అతని అభిప్రాయం కావచ్చు!" అని ఆవుదూడకేసి తిరిగి, అయామ్ సారీ పరమేశ్వరన్-అని క్షమించమన్నట్లు చెప్పాడు. రామారావుకు తల గిర్రున తిరిగిపోతోంది.

* * *

అసలు అరటిపళ్ళ తొక్కల్ని గురించీ ఆలోచించే మనుష్యులతో స్నేహం చేయకూడదు. అరటిపళ్ళ తొక్కలను గురించి ఆలోచించేవారు ఆవుదూడలను గురించి కూడా ఆలో

చిస్తారు. అరటి తొక్కలను ఆవుదూడలను గురించి ఆలోచించి నట్లే సుబ్బారావు జన్మలను జన్మాంతరాలను పునర్జన్మలను గురించి ఆలోచించసాగాడు. పరమేశ్వరన్ అంటే రిటరయి మళ్ళీ ఉద్యోగం చేస్తూ విశాఖపట్నంలో గుండె ఆగి మరణిం చిన పరమేశ్వరన్. పాలావిడి దొడ్లో ఆవుదూడగా జన్మించా డని- అతనికి పూర్వజన్మ వాసన ఉన్నదని సుబ్బారావు ప్రచా రంలో పెట్టేశాడు. ఈ విషయం సుబ్బారావుకెల్లా తెలిసిందని ఎవరూ బుకాయించలేదు. రైలింజనులాటి పాలావిడ నమ్మే సింది. పాలావిడ యింటికెదురుగా పరమేశ్వరన్ విధవ భార్య సింధియాలో పని చేసే కొడుకు, రయిల్వే ఆఫీసులో పనిచేసే అతడి కూతురు. కాలేజీలో చదువుకునే అమ్మాయి ఉన్నారు. పెద్ద అమ్మాయి పేరు రమామణి. ఆ అమ్మాయి స్టోర్సులో గుమస్తాగా ఉంటోంది. తెలుగు బాగావచ్చు. బొద్దుగానవ్వుతూ సందడిగా ఉంటుంది. చిన్నమ్మాయి సావిత్రి, చదువుకుం టోంది. సన్నగా పొడుగ్గా చలాకీగా ఉంటుంది.

పెద్దమ్మాయికి రంగురంగుల చీరలంటే యిష్టం. చిన్న మ్మాయికి పూవుల చీరలంటే మోజు. ఇద్దరూ పెళ్ళి కాదగిన స్థితిలో ఉన్నారు. పరమేశ్వరన్ హఠాత్తుగా కన్నుమూశాక "రమణి" కుటుంబానికి పెద్దరికం చేపట్టింది, పరమేశ్వరన్ కొద్దిగా డబ్బు సంపాయించాడు. రిటయిరయాక మళ్ళీ ఉద్యో గంలో చేరి ఇంకా కొంత సొమ్ము రావాలి. రమ. కి సావిత్రికి మధ్య పూలకుండీలా ఉన్నాడు శ్రీనివాసన్. షిప్‌యార్డులో డాఫ్ట్‌మన్‌గా పనిచేస్తున్నాడు పరమేశ్వరన్ భార్య జగదాంబ

చాలా పూర్వకాలపు మనిషి—ఆవేళ ఆదివారం. రమణి చేటలో బియ్యం పోసుకుని వరండాలో కూర్చుని గెడ్డల్ని ఏరుతోంది. శ్రీనివాసన్ మడతమంచం మీద బోర్లా పడుకుని "పెళుపదం" బొమ్మలు చూస్తున్నాడు. సావిత్రి కుర్చీలో కూర్చుని ఇండియన్ ఎక్స్‌ప్రెస్ చూస్తోంది కాళ్ళు ఊపుకుంటూ.

జగదాంబ అరటిపళ్ళు తెచ్చి ముందు సావిత్రికి తరువాత సీనుకి యిచ్చింది. రమణి అరటిపండు వద్దుగాక వద్దని తన పెద్దరికం నిలబెట్టుకుంది. గేటు వేసివుంది, కాని గేటువద్ద నాయరుకొట్టు వద్ద నిలబడే ఆవుదూడ నిలబడి ఆశగా లోపలకు చూస్తోంది. సెనగపిండి, చిట్టు, తవుడు, ఎండుగడ్డి రోజుకో పూట టిఫినులా పచ్చగడ్డి మేపుతే ఆవుదూడ తెల్లగా పాల సముద్రంలా మిసమిసలాడిపోవచ్చు. కాని విశాఖపట్నం ఆవు దూడలు నీళ్ళు లేక పోషణ లేక కాగితాలు గుడ్డపీలికలు తిని బ్రతకటం వలన అవి కంఠగత ప్రాణులై ఉన్నాయి. ఇంతమంది వరండాలో ఉండగా ఆవుదూడ వేసిన గేటు వేసినట్లే ఉండగా ప్రక్కనున్న దడిని త్రోసికుని "ఎవ్వరేమనుకొన్న నా కేటిసిగ్గు నాయిచ్చయ్ గాక నా కేటి వెఱవు" అన్నట్లు లోపలకు లంఘించింది. రమణి ఎర్రరంగు పట్టుచీర దండాన ఆర వేసి వుంది. ఈ లేగదూడ ఆ ఎర్రచీరను నోటితో నములుతూండగా ముగ్గురూ చూశారు. రమణీ చివాలున లేచి కర్ర పుచ్చుకుని దూడమీద కలబడింది. సావిత్రి తన పువ్వులచీర కాదు లెమ్మని ఊరుకొంది. శ్రీనివాసన్‌కు ఎర్రరంగు చీరలన్నా రమణిలాటి అక్క

లన్నా వాళ్ళ పెద్దరికాలన్నా ఒళ్ళుమంట. జగదాంబ వచ్చి నిలబడి ఒక అరవత్తొట్టు గట్టిగా ఝాడించింది. రమణి ఎత్తిన చేయి అలావుండగా రైలింజనులాటి పాలావిడ "తప్పమ్మా తప్పు! అయ్యరుగారిని కొట్టకండి. లెంపలేసుకోండమ్మా బిడ్డలూ—" అని అందుకుంది. రమణి అర్థంగాకుండా చూసింది శ్రీనివాసన్ మంచంమీంచి లేచినిలబడ్డాడు. సావిత్రి ముఖాని కడ్డంగా ఉన్న పేపరు ఒత్తిగించింది.

"ఇది ఆవుదూడ కాదమ్మా! జగదమ్మా—మనఅయ్యరు గారే యీ జన్మ ఎత్తారు. పుణ్యంకొద్ది తండ్రికి తన బిడ్డల మీద మమత చెరుపుకన్నా, చెరగనిదమ్మా" అని పాలావిడ తన బాంబును పేల్చింది.

జగదాంబ ప్రాన్పడిపోయింది.

తన భర్త ఒకవేళ ఆవుదూడగా జన్మించి ఉంటే అతను ఈ విధంగా వర్తమానంలోకి జొరబడి తన భర్తగా యింటి యజమానిగా తిరిగి యిలా రావటం ఎందుకో బావు లేదని అనిపించింది. రమణి ఎర్రచీరను లాక్కొని దూడను గోముగా నిమిరింది. శ్రీనివాసన్ సగం తింటున్న అరటిపండును దూడమీదకు విసిరాడు. పాలావిడ "నాన్నకు ఎంగిలి పెట్ట రాదు బాబూ" అని అంటుండగా రమణి తనవంతు పండును తెచ్చి దూడకు తినిపించింది. సావిత్రికి చర్రున కోపం వచ్చింది "రమణీ ఈ ఆవుదూడ మన నాన్నని నువ్వు నమ్మావన్నమాట" అని కేక పెట్టింది. పాలావిడ "ఎందుకమ్మా అల్లా రుంజుకుం టావు? మీ అక్క ఆఫీసులో సుబ్బారావుగారిని అడిగిస్తే తేలి

పోయేదానికి — ఇలాటివి ఎన్ని జరగటంలేదు — పత్రికలలో చదవటంలేదు కనక అయ్యరుగారు ధర్మప్రభువు కనుక గోజన్మ ఎత్తారు - మాక జన్మలేదు అమ్మదూ!" అని దూడ మెడలో త్రాడును చేతికి తీసుకుని "పదండి బాబూ! ఈ వూరు వచ్చిందిలగాయతూ మీ సొమ్ము నేను తిన్నాను. నా ఇంట్లో పుట్టారు మీకూ నాకూ ఋణానుబంధం- నేను మీకు సేవలు చేస్తాను. చూశారుగా సతులు సుతులు మాయ- సంసారాలు మాయ. నాయరుచేత కిల్లీకొట్టు మీరే పెట్టించారటగా ... ఆ సుబ్బారావు బాబు కనుక్కోబట్టి బ్రతికి పోయినాము. లేకపోతే... 'పదండి, పదండి' అని తన దూడను లాక్కొని వెళ్ళిపోయింది. సావిత్రి "డామిట్" అని పత్రికను నేలకేసి విసిరి పారేసింది.

జగదాంబ రెండు చేతుల్తో నెత్తి బాదుకుంటోంది. రమణి దిగులుగా ఎర్రచీర కుచ్చిళ్ళు మడత పెడుతోంది. సావీ ఎవరే ఆ సుబ్బారావు - అని శ్రీనివాసన్ లుంగీ పైకి బిగించాడు, సావిత్రి విస్ఫులింగాల్లా నిప్పులు కక్కుతూన్న కళ్ళతో సుబ్బారావుమీదకు దండయాత్రకు బయలుదేరింది.

* * *

సావిత్రి సుబ్బారావు యింటివద్దనుంచి తిరిగి వస్తూనే మంచంమీద బోర్లా పడుకుని వెక్కి వెక్కి ఏడువసాగింది. జగదాంబ, రమణి, శ్రీనివాసన్ చుట్టూ చేరి ఏవిటేవిటే అని గుచ్చి గుచ్చి అడిగారు.

"ఆ బ్రూటు...ఆ రాస్కెలు..." అని సావిత్రి ప్రళయ

కాల తాండవం చేసేస్తోంది. రమణి కౌగలించుకుని చెల్లెల్ని తన ఒళ్లో పడుకోబెట్టుకుని బుజ్జగిస్తూ ఏమన్నాడే...ఏం జరిగిందేం! అని రెట్టించింది.

"మా నాన్న ఈ ఆవు జన్మ ఎత్తి ఈ వీధిలో తిరుగుతున్నాడని ఎందుకు ప్రచారం చేస్తున్నావు?" అని అడిగాను అన్నది సావిత్రి.

సుబ్బారావు "క్షమించు సావిత్రీ! నీకు ఎంతో కష్టంగా ఉంటుంది. కాని నాకు పూర్వజన్మ సంగతులు తెలిసిపోతున్నాయి. అది నా తప్పుకాదు, మీ నాన్న అని నాకు తెలిసింది. అది నా సంస్కారం నేను చెప్పాను. చెప్పటం తప్పా అంటావా?" అని నసిగాడు.

"మా నాన్న చచ్చిపోయాక, ఆవైతే, గుర్రవైతే, పిల్లియితే మాకేమి జరుగుతుంది. ఇప్పుడు ఆ దూడను మేం యింట్లో కట్టివేసుకుని ఊరేగమంటావా? మమ్మల్ని ఎందుకు అల్లరి పెట్టడం..." అంది సావిత్రి.

"అదికాదు సావిత్రీ! నాకు పూర్వజన్మలో మీ కుటుంబంతో ముఖ్యంగా నీతో సంబంధం ఉంది. ఉంది కనుక నే నేను పిలవకుండా యిన్ని సంగతులు నీ అంతట నువ్వు వచ్చి నాతో చెబుతున్నావు నిజం సావిత్రీ మనకు జన్మాంతర సంబంధం ఉన్నది. నువ్వు నమ్మవా" అని నా రెండు చేతులు పట్టుకున్నాడు అన్నది సావిత్రి.

"ఏమైంది సావిత్రీ!" అని రమణి ఆతృతగా అడిగింది.

"లాగి లెంపకాయకొట్టి పారిపోయి వచ్చేసాను" అంది

కళ్ళు చెంగుతో ఒత్తుకుంటూ. ఆమెకళ్ళు ఎర్రగా వాచి ఉన్నాయి.

* * *

ఇది జరిగి చాలా కాలమయింది.

సావిత్రి రమణిద్వారా ఆఫీసులో రిపోర్టు చేసింది. కాని ఆఫీసువాళ్ళు ఈ జన్మకు సంబంధించిన సంగతులయితే చూడ కలరు. కాని క్రితంజన్మ విషయాలలో ఎలా జోక్యం కలిగించు కోగలరు. సుబ్బారావు పూర్వజన్మ సంగతులు అడపా తడపా మాట్లాడుతూండేవాడు. అతనితో మాట్లాడితే క్రితం జన్మ సంగతులు ఈ జన్మలో ఎవరెవరో బైటపడతాయని చాలా మంది ఊరుకుంటున్నారు. పరమేశ్వరన్ కేసు ఫైనలై డబ్బు కుటుంబానికి దొరికిపోయింది. పరమేశ్వరన్, అపుదూడ చక్కగా బలిసి సర్వాంగ సుందరంగా చూడముచ్చటగా తేలింది! అరటి తొక్కలంటే సుబ్బారావుకి ఎలర్జీ అలానే ఉంది.

ఉన్నట్లుండి సుబ్బారావు జన్మ జన్మాల సంగతులు మాట్లాడటం మానేసి బుద్ధిగా సంచరించటం మొదలెట్టాడు. సావిత్రి కేసి అసలు కన్నెత్తి చూడడంలేదు. అందరూ ఆశ్చర్య పోయారు.

సావిత్రి రమణితో ఈ సంగతి చూచాయగా అన్నది. రమణి ఎర్రపట్టుచీర కట్టుకున్నది. సావిత్రి పువ్వుల వాయిలు చీర కట్టుకున్నది. రమణి సావిత్రి చెవిలో యిలా చెప్పింది. "సుబ్బారావు భార్య పురుడు పోసుకుని మొన్ననే తిరిగివస్తే చంటిబిడ్డను చూసివద్దామని తను వెళ్ళి ఇలా యిలా జరిగిందని

సావిత్రిని యిలా అన్నాడని తాను సుప్రీం కోర్టుకు ఫిర్యాదు చేసింది. ఆవిడే ఏదో మంత్రంవేసి ఆటకట్టించి ఉంటుంది! అని అన్నది. "నీకు తెలీదా?" అని సావిత్రి రమణిని అడిగింది. రమణి నాకు తెలీదని ఊరుకుంది "అయితే నేను తెలుసుకు వస్తానని" అని సావిత్రి గబ గబా బయలుదేరింది. సుబ్బారావు యింట్లో లేడు. సాయంత్రాలు యింట్లో గోళ్ళు గిల్లుకుంటు పెళ్ళాం ముందు కూర్చుంటే ఆడవాళ్ళకు మొగాళ్లు లోకువవు తారని సుబ్బారావు పని లేకపోయినా టవునులో తిరిగి వస్తూ ఉంటాడు. సావిత్రి "అక్కా" అని పిలిచింది. సుబ్బారావు భార్య పిల్లవాడిని ఉయ్యాలలో పెట్టి ఊపుతూ వచ్చి లోపలికి తీసుకెళ్ళి కళ్ళతో ఏమిటి సావిత్రీ అని చిరునవ్వు నవ్వింది.

"ఏం చేసావు నీ మంత్రం నాకు చెప్పవూ?" అని బ్రతిమాలింది.

"నన్నుకూడా లెంపకాయ కొడదామని వచ్చావా?" అని ఎదురు ప్రశ్న వేసింది. సావిత్రి కాదక్కా-- చెప్పు! చెప్పు! అని గునిసింది.

"చెబుతాను కాని - ఈ పిల్లాడ్ని ఎత్తుకో, ఉయ్యాల సర్దాలి."

సావిత్రి పిల్లవాడిని ఉదుకుష్టంగా పట్టుకుంది.

"ఏమిటమ్మాయి పిల్లవాడినే ఎత్తుకోలేకుండా ఉన్నావు, లెంపకాయలు కొట్టడం అనుకున్నావా రవుడీ సావిత్రీ" అని పక పక నవ్వింది.

"నన్ను క్షమించు అక్కా..."

* * *

సు — గారి భార్య "పిల్లా ఈ మగాళ్ళు అడపా తడపా అరటిపండు తొక్కలమీద కాలువేస్తూ ఉంటారు. మనం నేర్పుగా సరిదిద్దుకోవాలి కాని చెడగా చెడగా కాపురాలుకావు. ఈ రాడీతనం మాని జాణతనం ఎప్పుడు నేర్చుకుంటావు?"

"చెప్పవా అక్కా!"

"అరుగో ఆయనొస్తున్నారు."

సావిత్రి ఒక్క ఎగురెగిరింది. సు-గారి భార్య ఆ పిల్లను వంటయింట్లోకి తీసుకెళ్ళి ఒక జంతిక చేతికిచ్చి "మొగుడు పెళ్ళాలమధ్య తగూలాటల వివరాలు, సంధి రాజకీయాలు నీ కెందుకే పిల్లా" అని బుగ్గలు రెండూ సాగతీసింది.

"చెప్పవా అక్కా" అని ఉడుకుమోతు తనంగా అడిగింది.

"గుప్పిడిమూస్తేనే గుట్టు, చెప్తాను విను. జన్మజన్మాల గురించి ఈయన కల్పనలు విని విని నేను ఒకటే చిన్న ముక్క అన్నాను. నాకు పూర్వజన్మ సంగతులు తెలుస్తున్నాయి అని. ఏమిటన్నారు. క్రితం జన్మలో మీరు నాకు స్త్రీ, సావిత్రి నాకు భార్య. ఒకరికి భర్త ఒకరికి ప్రియుడుగా ఉన్నానన్నాను."

వాక్యం పూర్తి కాకుండానే సావిత్రి గచ్చుమీదపడి పొరలి పొరలి నవ్వుతోంది.

ఈ మారు సుబ్బారావు నిజంగా మెట్లెక్కే వస్తున్నాడు.

★